కమనీయం.. సీతారాముల కల్యాణం

- వాడవాడలా ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు
- కల్యాణ ఘట్టాలను వీక్షించి తరించిన భక్త జనం
- పలు చోట్ల అన్న సమారాధనలు
- ఈ నెల 25 వరకు కొనసాగనున్న ఉత్సవాలు


శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయంలో పూజల్లో ఎమ్మెల్యే కోన దంపతులు


కోదండ రామాలయంలో పూజల్లో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

రేపల్లె రూరల్: శ్రీరామ నవమి పర్వదిన వేడుకలను నియోజకవర్గంలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రేపల్లె పట్టణ, మండలంలోని వివిధ ఆలయాలలో సీతారాముల విగ్రహాలకు మంగళస్నానాలు చేయించి వధూవరులుగా అలంకరించి పీఠంపై విగ్రహాలను నెలకొల్పారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ మేళతాళాలతో స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని పట్టాభిరామస్వామి, కోదండ రామస్వామి, 3వ వార్డు మునుసోబువారిపాలెం, కృష్ణా థియేటర్ ఎదురు బజారులోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపం, మండలంలోని కైతేపల్లి, పెనుమూడి, మోళ్ళగుంట, తుమ్మల, కారుమూరు తదితర గ్రామాలలో రాములోరి కల్యాణ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా పెదకూరగాయల మార్కెట్, ఓపెన్ థియేటర్ వెనుక, ఏబీఆర్ కళాశాల ఎదుట అగ్నికుల క్షత్రియుల ఆధ్వర్యంలో, పాతస్టేట్ బ్యాంక్ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు పానకం, వడపప్పు, సలిమిడిలను తీర్థప్రసాదాలుగా పంపిణీ చేశారు.


రేపల్లెలో శ్రీరామ నవమి పూజల్లో భక్తులు


భట్టిప్రోలు పరిధిలోని అద్దేపల్లి ఎస్టీ కాలనీలో కల్యాణంలో భక్తులు

బాపట్ల: శ్రీరామనవమి సందర్భంగా రాములోరి కల్యాణాన్ని బాపట్ల నియోజకవర్గంలో పలు ఆలయాల్లో నిర్వహించారు. చలువ పందిర్ల నీడలో కల్యాణ మహోత్సవం వేడుకలు అత్యంత వైభవంగా చేపట్టారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక భావన్నారాయణస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ఆయన సతీమణి రమాదేవితో పాటు కుటుంబ సమేతంగా పాల్గొన్ని పూజలు చేపట్టారు. వేదమంత్రాల మధ్య శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించారు.

బాపట్ల పట్టణంలోని భీమావారిపాలెం, చీలురోడ్డు సెంటర్‌లోని రామాలయాల వద్ద కల్యాణమహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు.

పిట్టలవానిపాలెం: మండలంలో శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం సీతారాముల వారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అన్ని గ్రామాలలోని రామాలయాల వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో ప్రత్యేకంగా అలంకరించిన ప్రదేశంలో కల్యాణాన్ని జరిపించారు. మరికొన్ని గ్రామాల్లో సీతారాముల వారి చిత్రపటాలను ఏర్పాటు చేసుకుని కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు.

ఖాజీపాలెంలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో భక్తులు, పలువురు ప్రముఖులు పాల్గొని కల్యాణాన్ని జరిపించారు. గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలో మండల పరిషత్ ఇన్‌చార్జ్ అధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, మాజీ సర్పంచ్ మంతెన రామచంద్రరాజు, మంతెన కృష్ణమూర్తి రాజు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఖాజీపాలెంలో కల్యాణం తిలకించేందుకు హాజరైన మహిళలు

పిట్టలవానిపాలెం శ్రీ సీతారామ చంద్రమూర్తి దేవాలయంలో జరిగిన కల్యాణోత్సవంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం 5 వేల మంది భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భవనంవారిపాలెం శివారు చోడిపాలెంలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువలా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. కోమలి, జిఎస్‌పాలెం, భవనంవారిపాలెం, పిట్టువారిపాలెం, కొత్తపాలెం, మన్నెంవారిపాలెం గ్రామాలలో సీతారాముల వారి కల్యాణ మహోత్సవాలను కన్నుల పండువగా జరిపించారు.

వలివేరులో వైభవంగా కల్యాణం

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం వలివేరులోని రెడ్ల వారి రామ మందిరంలో శ్రీ సీతారాముల కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమాలలో కారుమూరు బుచ్చిరెడ్డి-నళిని దంపతులు పాల్గొన్నారు. అర్చకులు సాయి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను తమ్మా కోటిరెడ్డి పర్యవేక్షించారు.


అలకాపురంలో ప్రత్యేక అలంకారంలో ఉత్సవ మూర్తులు

భట్టిప్రోలు: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఊరువాడ పులకించింది. భక్తి పారవశ్యంలో ఓలలాడింది. చూడ చక్కని సీత, అందాల రాముని కల్యాణాన్ని భక్తజనం కనులారా తిలకించి పరవశించింది. భట్టిప్రోలులోని అన్ని రామాలయాలలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరాముడు పుట్టిన రోజు చైత్ర మాసం నవమి తిథి నాడే సీతారాముల కల్యాణం జరిపించటం ఆనవాయితీగా వస్తోంది. దీంతో భక్తులు ఏటా శ్రీరామ నవమి వేడుకలు జరుపుకుంటారు. భట్టిప్రోలు విత లేశ్వరనగర్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పలువురు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అద్దేపల్లి రామాంజనేయ గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో రామాంజనేయ నగర్ (ఎస్టీ కాలనీ)లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, తదితరులు పర్యవేక్షించారు. మండలంలోని ఐలవరం, తాడిపర్తి రామ మందిరాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. శ్రీ సత్యన్నారాయణ స్వామి వ్రతాన్ని యునెస్కో వాస్తు పండిట్ వంగర చలమయ్య సిద్ధాంతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది.


భట్టిప్రోలు మండలం అద్దేపల్లిలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న చిన్నారులు

వైభవంగా సీతారాముల కల్యాణం

కర్లపాలెం: శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు బుధవారం మండలంలోని వాడవాడలా అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం జరిపించేందుకు ప్రత్యేకంగా చలువ పందిళ్లు వేసి మామిడి ఆకుల తోరణాలు కట్టారు. అరటి గెలలు, తాటి గెలలు, పుచ్చకాయలు, గుమ్మడి కాయలు, వివిధ రకాల పండ్ల గెలలతో చలువ పందిళ్లకు అలంకారం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై సీతారాముల విగ్రహాలు, చిత్రపటాలను ఉంచి పూలమాలలతో అలంకరించారు. మంగళ వాయిద్యాలతో గ్రామస్తులు తీసుకువచ్చిన తలంబ్రాలను స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు వేద మంత్రాలు చదువుతూ సీతారాముల విగ్రహాలపై జిలకర్ర, బెల్లం ఉంచి పూజలు నిర్వహించారు. అమ్మవారి మంగళ సూత్రాలను భక్తులు దర్శించుకున్న అనంతరం సీతారాముల కళ్యాణ వేడుకలు శాస్త్రోక్తంగా జరిపించారు. సీతారాముల కల్యాణం అనంతరం చిత్రపటాలకు భక్తులు అక్షంతలు వేసి పూజలు చేశారు. మండలంలోని నాగరాజుపాలెం, దమ్మనవారిపాలెం, దుండివారిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, యాజలి, బుద్దాం ఏట్రవారిపాలెం, కొత్తనందాయపాలెం, నల్లమోతువారిపాలెం, పాతనందాయ పాలెం, కర్లపాలెం, పాపిరెడ్డిపాలెం, బంగారురెడ్డిపాలెం, చింతాయపాలెం, గణపవరం, పెదపులుగువారిపాలెం, సర్రావారిపాలెం, తుమ్మలపల్లి, పెదగొల్లపాలెం, పేరలి, కొత్తపాలెం, సమ్మెటవారిపాలెం, శీలంవారిపాలెం, సత్యవతీపేట గ్రామాలలోని రామాలయాలలో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పానకం, వడపప్పు, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.


యాజలి కోదండ రామస్వామి ఆలయంలో పూజలందుకున్న ఉత్సవ మూర్తులు

శ్రీరాముని జీవితం యువతకు ఆదర్శం

చెరుకుపల్లి: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాములోరి కల్యాణం బుధవారం మండలంలో వాడవాడలా అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సఖ్యలో రావటంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. ఆలయాల్లో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. అర్చక స్వాముల ఆధ్వర్యంలో స్వామి వారికి ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని గుళ్లపల్లి కోదండ రామాలయం వద్ద జరుగుతున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో రేపల్లె వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో మమేకమై అందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు.


గుళ్లపల్లి కోదండరామాలయంలో పూజల్లో పాల్గొన్న డాక్టర్ గణేష్

క్లుప్తంగా

నేడు అమర్తలూరులో ఎన్నికల ప్రచారం

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండల కేంద్రంలో గురువారం ఉదయం 6 గంటలకు ఎన్నికల ప్రచారం ప్రారంభించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు యలవర్తి సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని చెప్పారు.

వీల్‌చైర్ బహూకరణ



గుంటూరు మెడికల్: నగరంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి వీల్ చైర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వీల్ చైర్ బహూకరించడం అభినందనీయమన్నారు. సమితి సభ్యులు ఆసుపత్రికి వస్తున్న రోగులకు సేవలు అందిస్తున్నారని దాంతో పాటుగా వీల్ చైర్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, ఎస్.వి.హనుమంతరావు, కె.సాయి బాబు, విశ్వనాధ్, కె శ్రీధర్, పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



నగరం: మండలంలోని అక్కిలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ పి కోటేశ్వరావు చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సుమారు 40 సంవత్సరాలు వయస్సు కలిగి 5.5 అడుగుల ఎత్తు, సిమెంట్ కలర్ కాటన్ ప్యాంట్, ఎరుపు, నలుపు రంగు చెక్స్ చొక్కా ధరించిన వ్యక్తి మృతదేహన్ని అక్కిలేరు కాలువలో గుర్తించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటేశ్వరావు పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసినవారు రేపల్లె రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ 9440796166, నగరం పోలీస్ స్టేషన్ 9440900877 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫుడ్ అథారిటీ పేరిట బెదిరింపులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన హోటళ్ల నిర్వాహకులు

తెనాలిరూరల్: ఫుడ్ అథారిటీ పేరిట ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తుండడంపై హోటళ్ల నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెనాలికి చెందిన పలువురు హోటళ్ల నిర్వాహకులకు ఇటీవల కాలంలో ఫుడ్ ఆథారిటీ నుంచి ఫోన్ చేస్తున్నామని మీ హోటల్ మీద ఫిర్యాదు అందిందంటూ రూ.25 వేలు కట్టకపోతే కేసు నమోదు చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. 9985387372, 6300379366 నంబర్ల ద్వారా ఫోన్‌లు వస్తున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఏపీ హోటల్స్ అసోసియేషన్ కోశాధికారి ఈదర వెంకట పూర్ణ చంద్, తెనాలి హోటల్స్ అండ్ ఫుడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కనిగిచర్ల రమాకాంత్, తోటకూర సుబ్రహ్మణ్యం, నందిపాటి సుధీర్ బాబు, కంచాని కొండారెడ్డి, బొమ్మారెడ్డి సతీష్ రెడ్డి, గండికోట శివప్రసాద్, అన్నవరపు సురేష్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు.

కాలువలో మునిగి విద్యార్థి మృతి

తెనాలిరూరల్: తెనాలి మండలం సంగం జాగర్లమూడిలోని కొమ్మమూరు కాలువలో మునిగి విద్యార్థి మృతి చెందాడు. నర్సరావుపేట మండలం ఇక్కుర్రుకు చెందిన గల్లా వంశీకృష్ణ(17) వడ్లమూడిలోని ఓ యూనివర్శిటీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. తనతోటి మరో ముగ్గురు స్నేహితులతో కలసి సంగం జాగర్లమూడి సంగమేశ్వరస్వామి దేవస్థానం వద్ద కాల్వకు బుధవారం సాయంత్రం వచ్చారు. ఈత కొడుతుండగా వంశీకృష్ణ మునిగిపోయాడు. కాపాడేందుకు అతని స్నేహితుడు చివిలిపల్లి వెంకటేష్ ప్రయత్నించినా చివరికి నీటిలో గల్లంతయ్యాడు.రాత్రికి మృతదేహం లభించింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేబీఎన్‌పీ పొన్నూరు అభ్యర్థిగా వరికుంట



పెదకాకాని: జై భారత్ నేషనల్ పార్టీ పొన్నూరు అభ్యర్థిగా వరికుంట రోశయ్య ఖరారయ్యారు. పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ రాష్ట్ర వ్యాప్తంగా 48 మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించడం జరిగిందని, ఆ జాబితాలో పెదకాకాని గ్రామానికి చెందిన నాపై నమ్మకం ఉంచి పొన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని రోశయ్య వెల్లడించారు.

నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

- నేటి నుంచి దాఖలు చేయనున్న అభ్యర్థులు
- రేపల్లె ఆర్వో కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి



నామినేషన్‌ల స్వీకరణకు సిద్ధమైన రేపల్లె ఆర్వో కార్యాలయం

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణకు సమయం ఆసన్నమైంది. రేపల్లె నియోజకవర్గ 90వ అసెంబ్లీ సెగ్మెంట్ నామినేషన్ స్వీకరణకు రేపల్లె ఆర్వో కార్యాలయంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. 18వ తేదీ గురువారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. నిర్దేశించిన తేదీలలో పండుగలు, ప్రభుత్వ సెలవు దినాలు మినహాయించి ప్రతిరోజు ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు నామినేషన్‌లు స్వీకరిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెలా షారోన్ తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి రూ.10వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. రేపల్లె ఓపెన్ కేటగిరీ కావటంతో ఎవరైనా పోటీ చేయవచ్చన్నారు. అయితే ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గంకు చెందిన వారు నామినేషన్ దాఖలు చేసే క్రమంలో నిర్ణీత సెక్యూరిటీ డిపాజిట్‌లో 50 శాతం రాయితీ కలిప్పించబడునన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. నామినేషన్ సమయంలో ఆర్ఓ కార్యాలయం వద్ద సీసీ టీవీ పుటేజ్‌తో పాటు వీడియో రికార్డింగ్ నిఘా ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని చెప్పారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

వేమూరు: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు తెలిపారు. నామినేషన్లను షెడ్యూలు ప్రకారం ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు తీసుకుంటారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి భారత పౌరుడై ఉండటంతో పాటు 26-04-2024 నాటికి 25 సంవత్సరాలు వయస్సు పైబడి ఉండాలి. నామినేషన్‌ను ఫారం 2-బిలో రిటర్నింగ్ అధికారికి దాఖలు పరచాలి.


వసంతరాయుడు
రిటర్నింగ్ అధికారి

అసెంబ్లీ నియోజక వర్గాలలో నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గాలలో 50 శాతం డిపాజిట్ ఉంటుందన్నారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థికి తనతో పాటు మరో నలుగురిని మాత్రమే ఆర్ఓ వద్దకు అనుమతిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధి వరకు మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తామన్నారు. అభ్యర్థి లేదా ప్రతిపాదకుడు మాత్రమే నామినేషను పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆయన సూచించారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాలు దూరం

అగ్నిమాపకశాఖ అధికారి సాంబశివరావు


విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేపల్లె రూరల్: విపత్తులు, ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపకశాఖ అధికారి వై.సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని మాంట్‌ఫోర్ట్ స్కూలులో బుధవారం నాల్గవ రోజు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అగ్ని ప్రమాదం వాటిల్లిన వెంటనే ఆందోళన చెందకుండా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. మహిళలు వంట పూర్తవ్వగానే గ్యాస్ సిలెండర్ రెగ్యులేటర్‌ను ఆపివేయాలన్నారు. పెట్రోలు బంకుల వద్ద సెల్‌ఫోన్ మాట్లాడటం, ధూమపానం చేయరాదన్నారు. గృహాలు, దుకాణాలలో విద్యుత్ వైర్లు సరిగ్గా ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. లేనిపక్షంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని అగ్ని ప్రమాదాలు సంభవించిన సందర్భాలు ఉన్నాయన్నారు. అగ్నిప్రమాదాలు వాటిల్లితే వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. పడవలలో ప్రయాణం చేసే సమయంలో ప్రమాదానికి గురైతే లైఫ్ జాకెట్‌లు వినియోగించటం, ప్రమాదం నుంచి బయట పడటం వంటి అంశాలపై సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నాగేశ్వరరావు, ఎస్.నాగేంద్రరెడ్డి, జీ.కోటేశ్వరరావు, వి.సుబ్బారావు, ఎం.జనార్ధనరావు, కేవీ సాయికృష్ణారెడ్డి, పి.హరిబాబు, బీ.వీరకుమార్, సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి పెళ్లికి అతిథిగా వచ్చిన వానరం



పెదకాకాని : శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు అర్చకులు శాస్త్రోక్తముగా జరిపించారు. పెదకాకాని సదాశివకాలనీలోని రామాలయం వద్దకు బుధవారం సీత రాముల కల్యాణ వేడుక జరుగుతున్న సమయంలో ఆలయంలోకి వానరం (కోతి) వచ్చి భక్తులను ఆశ్చర్యానికి గురి చేసింది. సదా శివకాలనీలో చోటు చేసుకున్న ఈ సంఘటన భక్తులను ఆనందింపజేసింది. సాంప్రదాయబద్ధంగా వేద మంత్రోచ్చారణ మధ్య కల్యాణం జరిగినంత సేపు అక్కడే ఉండి వీక్షించింది. కల్యాణం పూర్తి అయిన అనంతరం ఆ వానరం సీతమ్మవారి పాదాలు తాకి కేవలం ప్రసాదం మాత్రమే తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయింది. పూజా కార్యక్రమాలు సమయంలో భక్తులను ఎటువంటి భయభ్రాంతులకు గురిచేయకపోవడంతో సాక్షాత్తు ఆంజనేయ స్వామి వచ్చి ప్రసాదం స్వీకరించినట్లుగా భక్తులు భావిస్తున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులందరికీ పానకం, వడపప్పు, పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు.

నవ్యాంధ్ర శ్రేయస్సుకు జనచైతన్య యాత్ర


రక్త క్షేత్రంలో నివాళి అర్పించిన విమలక్క, నాయకులు

తెనాలి: ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా తదితర సమస్యలపై విప్లవ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు చేపట్టిన జనచైతన్య యాత్ర బుధవారం రాత్రి బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని చుండూరుకు చేరుకుంది. అక్కడి రక్త క్షేత్రంలో చుండూరు మృత వీరులకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క పూలతో నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2021 ఆధారంగా సాక్షాత్తూ పార్లమెంటులో హామీపడ్డ ప్రత్యేక హోదాను పదేళ్లుగా అటకెక్కించారని ఆరోపించారు. నవ్యాంధ్రకు మూడో దఫా ఎన్నికలు జరుగుతున్న సమయంలో ప్రధాన పార్టీలు దీనిపై దృష్టిని కేంద్రీకరించటం లేదన్నారు. విశాఖ రైల్వే జోన్ రావాల్సిన సమయంలో ఆంధ్రుల హక్కుగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఉరికంబం మీద నిలబడి ఉందన్నారు. రాయలసీమ-ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా అభివృద్ధి ప్యాకేజీ జాడలేదన్నారు. అడవులు, కొండలు, తీర ప్రాంతాలు, సస్యశ్యామలమైన నేలలు అనే తేడా లేకుండా అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల పరం అవుతూనే ఉన్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తిని అందుకుని ఆయన 133వ జయంతి రోజున నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని కండలేరు నిర్వాసిత గ్రామమైన తానంచర్ల నుంచి జనచైతన్య యాత్రను ప్రారంభించినట్టు తెలిపారు. 21 రోజుల పాటు సాగే బస్సు యాత్ర వివిధ సమస్యలు లేవనెత్తుతూ శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతకర్త అయిన కారల్ మార్క్స్ 206వ జయంతి రోజున శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడు గ్రామానికి చేరి ముగుస్తుందని తెలిపారు. ప్రజా ప్రతిపక్షంగా చేస్తున్న ఈ యాత్రకు భావ సారూప్యత కలిగిన సంఘాలు, దళిత ఉద్యమ కారులు, ప్రజాస్వామిక వాదులు సంఘీభావం తెలియజేయాలని కోరారు. వీరితో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కరీం బాషా, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం ప్రతినిధి బి.గంగ, ఏసీఎఫ్ మల్సూర్ తదితరులున్నారు. చుండూరు దళిత పోరాట కమిటీ అధ్యక్షుడు జాలాది మోజెస్ స్వాగతం పలికారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కర్లపాలెం: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి పేకాట ఆడే వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని కర్లపాలెం ఎస్‌ఐ జనార్దన్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కర్లపాలెంలో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లతో పాటు రూ.57,200ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మత సామరస్యంలోనే ఆనందం

గుంటూరు మెడికల్ : మత సామరస్యంలో ఉన్న ఆనందం కంటే మరొకటి ఉండదని గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, హోప్ విన్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ షమ సుల్తాన అన్నారు. తండ్రికి ఇచ్చిన మాట కోసం రాజ్యాన్నే త్యజించిన గొప్ప పాలకుడు శ్రీరామచంద్రుడు ఆమె కొనియాడారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా బుధవారం గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులకు డాక్టర్ షమ సుల్తాన మజ్జిగ పంపిణీ చేశారు. దీంతో మండుటెండలో మజ్జిగ ఇచ్చి దాహాన్ని తీర్చిన డాక్టర్ షమ సుల్తానకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాముని కాలంలో ధర్మం నాలుగు పాదాలపై నడిచిందని, ఈ నేపథ్యంలో రాముని వంటి రాజు కోసం, రామరాజ్యం నాటి పాలన కోసం నేటికీ ప్రజలు పరితపిస్తుంటారని అన్నారు. భారతదేశంలోని నేటి రాజకీయ నాయకులు ప్రతి ఓటర్‌ను తమ ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు అన్నదమ్ముల్లా..అన్నాచెల్లెళ్లలా కలిసిమెలిసి ఉంటున్న తమను కులాలు, మతాల పేరుతో విడదీస్తున్నారని అలాంటి కుట్రలకు తాము అవకాశం ఇవ్వమన్నారు. హోప్ విన్ హాస్పటల్ మేనేజర్ పి. నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.